క్లుప్తంగా

రామనారాయణంలో ప్రత్యేక పూజలు


దేవతామూర్తులకు పాలాభిషేకం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో భూదేవి, శ్రీదేవి సమేత వైకుంఠ నారాయణునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు చాణక్య ఆధ్వర్యంలో దేవతామూర్తులకు స్నపనం, అర్చన, పంచామృతభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి శ్రీమద్భాగవత సప్తాహం

విజయనగరం: నగరంలోని లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు చిన్మయ మిషన్ కార్యవర్గ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవచకులు స్వామి విజయానంద సరస్వతిచే భక్త విజయం ప్రహ్లాదచరితంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: మండలంలో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టులకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సవరవిల్లి, లింగావలస, చేపలకంచేరు, నందిగాం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఐదు పోస్టులకు గాను పది మంది దరఖాస్తు చేసుకోగా.. అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీకి చేరిన ప్రశ్నపత్రాలు


ఎస్‌ఏ-2 పేపర్లను సర్దుతున్న ఎమ్మార్సీ సిబ్బంది

నెల్లిమర్ల: సమ్మేటివ్ ఎసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) ప్రశ్నపత్రాలు స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు ఆధ్వర్యంలో సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వేరుచేసి పాఠశాలల వారీగా సిద్ధం చేశారు. 73 ప్రభుత్వ, ఏడు ప్రైవేట్ పాఠశాలలకు ప్రశ్నపత్రాలను సరఫరా చేస్తామని ఎంఈఓ తెలిపారు.

సెంచూరియన్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న అధ్యాపకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వర్సిటీలో చదువుతున్న పలువురు అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, సర్వజన ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక ఆంధ్ర సమాజ పితామహుడు కందుకూరి


కందుకూరి వేషధారణలో రామానాయుడు, చిన్నారులు

విజయనగరం టౌన్: ఆధునిక ఆంధ్రా సమాజ పితామహుడు కందుకూరి విరేశలింగమని శ్రీనివాసా ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బీ రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో కందుకూరి 175వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ సేవ కోసం కందుకూరి హితకారిణి అనే ధర్మసంస్థను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


విజయనగరం రూరల్: లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలోనే విజయనగరం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని కొండకరకాంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్లలో ఒక్కో ఇంటికి మంజూరైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే కోలగట్ల దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, సంక్షేమ సారథి అయిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందన్నారు. జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రజల కష్ట సుఖాల్లో అటు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఇటు ఎమ్మెల్యే కోలగట్ల పాలుపంచుకుంటున్నారని కొనియాడారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే రైతుభరోసా, అమ్మఒడి, ఆసరా వంటి పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి రాంబాబు, భోగాపురపు ఆదినారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం.. : నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరవవుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మోదవలస పంచాయతీలోని వల్లూరు, కోమటిసత్రం, గండిబోయిన కల్లాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఇతర నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయా కుటుంబాలకు చేకూరిన ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఇలాంటి సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కనకల రామారావు, రాష్ట్ర నాగవంశం బోర్డు డైరెక్టర్ బోని అప్పలనాయుడు, పార్టీ నాయకుడు కిట్టు, పలువురు అధికారులు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: మోదవలస పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రాష్ట్రంలో సంక్షేమ పాలన


నెల్లిమర్లలో గోడకు స్టిక్కర్ అంటిస్తున్న చిక్కాల

• వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల

నెల్లిమర్ల: గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని నెల్లిమర్ల నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. నగర పంచాయతీ వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావుతో కలిసి పట్టణంలోని 8వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, జగనన్న పాలనకు తేడా వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, కారుకొండ హరీశ్ పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలపై ఆరాతీస్తున్న కౌన్సిలర్ ప్రసాద్

7వ వార్డులో..

నగరపంచాయతీ 7వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. స్థానిక కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, మహేశ్వరి దంపతులతో పాటు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. కుటుంబ యజమానుల అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత


నగదు అందజేస్తున్న కౌన్సిలర్ సంతోష్‌కుమార్

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని 11వ వార్డుకు చెందిన కొండేటి ప్రకాష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా మొత్తాన్ని స్థానిక కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్ శుక్రవారం రాత్రి అందజేశారు. ప్రకాష్ మృతి చెందడంతో ఆయన భార్య రామలక్ష్మికి మొదటి విడత సాయంగా రూ. 10 వేలు అందించారు. మిగిలిన రూ. 90 వేలు బ్యాంక్ ఖాతాలో జమవుతాయని కౌన్సిలర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు రవ్వా నాగేంద్రవర్మ, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, వలంటీర్ భాగ్యలక్ష్మి, సచివాలయ కన్వీనర్ కొండేటి కుమారి, తదితరులున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిక్కాల

• వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక థామస్‌పేట 15వ వార్డులో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి ప్రారంభమై ఎండలు ఎక్కువగా ఉన్నందున అన్ని వార్డుల్లోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, 11వ వార్డు కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్, స్థానిక నాయకులు మజ్జి గణేష్, రవ్వా నాగేంద్రవర్మ, సింగిడి కృష్ణ, బోని మధు, కొమ్మాది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: వైద్యరంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఉప్పాడపేటలో పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇంటివద్దే ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని బీపీ, సుగర్ రోగులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి


ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కరపత్రాలను అందజేస్తున్న అగ్నిమాపకశాఖ

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె.వినయ్, స్థానిక ఫైర్‌స్టేషన్ అగ్నిమాపక శాఖాధికారి వి. సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని పాతబస్టాండ్, గంటస్తంభం, కన్యకపరమేశ్వరి ఆలయ కూడలి, ఎన్‌సీఎస్, సీఎంఆర్ , రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన వాటర్ డెమో అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


రోషన్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫూల్‌బాగ్: ఐఎన్‌టీఎస్ఓ ఫలితాలలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విజయాలు సాధించడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక రింగ్‌రోడ్డు వద్దగల శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్న వెంకుమహంతి రోషన్‌కు ల్యాప్‌టాప్ గ్రాండ్‌ప్రైజ్ సాధించడంతో పాటు ఏడుగురు విద్యార్థులు ట్యాబ్‌లను సాధించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జరిగిన పరీక్షలో పాఠశాల విద్యార్థులు విజయాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఎంవీ సురేష్, అకాడమీ కో ఆర్డినేటర్ ఎ. బాలరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గారావు మృతి తీరనిలోటు..

విజయనగరం ఫూల్‌బాగ్: సామాజిక ఉద్యమకారుడు మలిచర్ల దుర్గారావు మృతి తీరని లోటని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. పట్టణంలోని దుర్గారావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దుర్గారావు రజక సంఘానికి, బీసీ సంఘానికి అనేకరకాల సేవలు అందించారని కొనియాడారు. ఆయన వెంట రజక సంఘం రాష్ట్ర నాయకురాలు ఎలిగాపు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జైనాథ్, పి. మోహన్, బీసీ సంఘ నాయకులు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిహారంపై విచారణ


విచారణ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, తదితరులు

పూసపాటిరేగ: కుమిలి తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువలో భూములు కోల్పోతున్న రైతులకు అందుతున్న పరిహారంపై శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో విచారణ జరిగింది. డిప్యూటీ తహసీల్దార్ లావణ్య ఆధ్వర్యంలో జరిగిన విచారణలో పలువురు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ తిరుపతినాయుడు

విజయనగరం రూరల్: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెల్లూరు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. మండలంలోని చెల్లూరు గ్రామ సచివాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కె.ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే పారిశుధ్యం, తాగునీటి సమస్య, వచ్చే ఏడాదిలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, ఇతరత్రా అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా ఉండాలి


వంటకాలు రుచి చూస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రుచికరమైన భోజనం వండిపెట్టాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తలగాం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. జగనన్న గోరుముద్ద పథకం వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తలగాం, ఎం.సీతారాంపురం సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ, ఉద్యోగులు హాజరు, రికార్డుల నిర్వహణ, స్పందన వినతుల పరిష్కారం తదితర అంశాలను పరిశీలించారు.

భూసార పరీక్షలపై అవగాహన


కొండగుంపాంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో వ్యవసాయ సిబ్బందికి భూ సార పరీక్షలపై ఏఓ పూర్ణిమ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. భూసార పరీక్షలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని..పంటలు దిగుబడి పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు రైతుల వద్దకు వెళ్లి పొలాల్లో మట్టిని సేకరించాలని సూచించారు. అనంతరం భూసార పరీక్షలు ఎలా చేయాలో క్షేత్ర స్థాయిలో చేసి చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు


మట్టి నమూనాలపై అవగాహన చేస్తున్న వ్యవసాయాధికారి నీలిమ, తదితరులు


పూసపాటిరేగ: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె. నీలమ అన్నారు. స్థానిక సచివాలయంలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూమి ఉన్న ప్రతి రైతూ భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

• ఐకమత్యంతోనే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక సభ్యుడు కైలసాని సాయికుమార్ అన్నారు. శనివారం స్థానిక కొత్తపేట మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో నాయుడు సురేష్ పర్యవేక్షణలో కైకాల చేనేత సామాజికవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్తూరు నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు సుమారు 11 జిల్లాల్లో కైకాల కులస్తులు ఐకమత్యంతో నడుస్తున్నారన్నారు. సమావేశంలో నాయుడు సంతోష్, హరిప్రసాద్, గురునాథరావు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలి


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: మహిళలు స్వయం ఉపాధి వైపు దృష్టిసారించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏసీ చిరంజీవి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య వద్ద మహిళా సంఘాల సభ్యులకు, వారి కుటుంబాలకు చెందిన మహిళలకు ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను శనివారం పరిశీలించారు. కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందని, శిక్షణ 90 రోజులు ఉంటుందని అన్నారు. శిక్షణా సమయంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికెట్లతో పాటు పీఎంఈజీపై ద్వారా రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. జిల్లా మహిళా, యువజన ఉపాధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా భారత్ డైనమిక్ లిమిటెడ్ సంస్థ ఈ శిక్షణ ఇస్తుందని అన్నారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ పి.కుమారి, అసిస్టెంట్ ట్రైనీ లాభాన అనూరాధ, ఏపీఎంలు దధికుమార్, హేమలతలు పాల్గొన్నారు.